క్లుప్తంగా

సైబర్ నేరగాళ్లతో అప్రమత్తం



కేటీదొడ్డి: విద్యార్థులు, యువత సైబర్ నేరాలపై పూర్తి అవగాహన కలిగి ఉండి, తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్ఐ శ్రీనివాసులు సూచించారు. ఈ మేరకు మండలంలోని నందిన్నెలో ప్రజలకు సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ప్రజలు వ్యక్తిగత బ్యాంకింగ్ వివరాలను అపరిచితులతో పంచుకోవద్దని, ఓటీపీ, పేటీఎం, గూగుల్‌పే, కేవైసీలను అప్‌డేట్ చేయమని వచ్చే మెసేజ్‌ల స్పందించకూడదన్నారు. సైబర్ నేరాలకు గురైతే 1930 టోల్‌ఫ్రీ నెంబర్‌కు ఫిర్యాదు చేస్తే నష్ట నివారణ చేయొచ్చని సూచించారు. అనుమానిత వ్యక్తులు గ్రామంలో కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. బాల్యవివాహాలు చేసినా, ప్రోత్సాహించినా వారిపై కేసులు నమోదు చేస్తామని, మహిళలను, బాలికలను వేధిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

యువతతోనే గ్రామాల్లో చైతన్యం



రాజోళి: యువతతోనే గ్రామాల్లో చైతన్యం సాధ్యమవుతుందని డాక్టర్ శివార్చక్ విజయ్‌కుమార్ అన్నారు. గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ అండ్ గాంధీ జ్ఞాన్ ప్రతిష్ఠాన్ ఆధ్వర్యంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ఆయన చేస్తున్న పాదయాత్ర సోమవారం మండలంలోని మాన్‌దొడ్డి గ్రామానికి చేరకుంది. వంద రోజుల్లో వెయ్యి కిలోమీటర్ల పాదయాత్ర చేయనున్నట్లు ఆయన తెలిపారు. స్థానికంగా ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గాంధీజీ అనుసరించిన విధానాలను సమాజంలో అందరూ పాటించేలా యువత కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీ ఫౌండేషన్ మండల ఇన్‌చార్జ్ హనిమిరెడ్డి, శివకుమార్ పాల్గొన్నారు.

బీజేపీ బలోపేతానికి కృషి



అయిజ: మండలంలోని పులికల్ గ్రామంలో సోమవారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో ఎక్కువ మందితో బీజేపీ సభ్యత నమోదు చేయించి, పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు గోపాలకృష్ణ, రాజశేఖర్, హుసేనినాయుడు, ప్రజలు పాల్గొన్నారు.

ఎల్వోసీ అందజేత



కేటీదొడ్డి: మండలంలోని మల్లాపురం గ్రామానికి చెందిన అరుణమ్మకు సీఎంఆర్ఎఫ్ నుంచి మంజూరయిన రూ.2.50లక్షల ఎల్వోసీని సోమవారం ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ వైస్‌ఎంపీపీ రామకృష్ణనాయుడు, నాయకులు తిమ్మప్ప, గోపి తదితరులు ఉన్నారు.

'భవిష్యత్‌లో రచయిత్రిగా ఎదగాలి'



అలంపూర్: భవిష్యత్‌లో ఎర్రవల్లి మండలంలోని కారుపాకులకు చెందిన రాముడు కుమార్తె మహేశ్వరి గొప్ప రచయిత్రిగా ఎదగాలని రాష్ట్ర గిడ్డంగుల సంస్థ మాజీ చైర్‌పర్సన్ రజినిసాయిచంద్ ఆకాంక్షించారు. మహేశ్వరీ రాసిన నాన్న అనే కవిత్వం వీడియో టీజర్‌ను హైదరాబాదులోని తన నివాసంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ మాజీ చైర్‌పర్సన్ రజినిసాయిచంద్‌ను సోమవారం ఆవిష్కరించారు. మహేశ్వరీ బీటెక్ విద్యను అభ్యసిస్తూ.. కవితలు రాస్తు అందరి మన్ననలు పొందుతుంది.



జములమ్మ ఆలయంలో..



అయిజలో..



శాంతినగర్‌లో..



గట్టులో..



మల్దకల్‌లో..

ఆదుకోవమ్మా... ఆదిపరాశక్తి



రాజోళిలో..

సాక్షి, నెట్‌వర్క్: దేవీశరన్నవరాత్రులను పురస్కరించుకొని శనివారం జిల్లాలోని వివిధ ఆలయాల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. మహిళలు కుంకుమార్చన చేశారు.

■ గద్వాల పట్టణంలోని కన్యకాపరమేశ్వరి ఆలయం, శ్రీశక్తిస్వరూపిణి తాయమ్మ ఆలయంలో అమ్మవారు అర్ధనారీశ్వరి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. జములమ్మ ఆలయంలో అమ్మవారు పార్వతీదేవిగా, పిల్లిగుండ్లలోని శివకామేశ్వరి అమ్మవారు చంద్రవాహిని, మార్కండేయస్వామి ఆలయంలో అన్నపూర్ణదేవిగా, కుమ్మరివీధి, బాలజీ వీధిలో అంబాభవాని ఆలయం, వీరభద్రస్వామి ఆలయంలో అమ్మవారు వివిధ రూపాలలో కనువిందు చేశారు.



బీచుపల్లిలో గాయత్రీదేవిగా దర్శనమిచ్చిన దుర్గామాత



ధరూరులో కాళికాదేవి ఆలయంలో పూజల్లో పాల్గొన్న భక్తులు

■ శాంతినగర్ వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారు లలితాదేవి అలంకరణలో భక్తులచే పూజలందుకున్నారు. ఈసందర్భంగా ఆలయ అర్చకులు వినయ్‌కౌశిల్‌శర్మ భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. భక్తులకు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు రావూరి సురేష్‌కుమార్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

■ గట్టులోని భవానీ మాత ఆలయంలో అమ్మవారు పార్వతీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. కోట్ల గేరిలోని శ్రీకాళికాదేవీ ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

■ అయిజ మున్సిపాలిటీలోని కాలమ్మపేటలో అమ్మవారు లలితాత్రిపుర సుందరీదేవిగా, కన్యకాపరమేశ్వరి ఆలయంలో సరస్వతి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. పట్టణ సమీపంలోని కట్టకింది తమ్మప్పస్వామి ఆలయంలో గరుడ వాహనంపై వేంకటేశ్వరస్వామి, శ్రీదేవి, భూదేవి ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు.

■ బీచుపల్లి ఆంజనేయస్వామి ఆలయంలో గాయత్రీదేవి అలంకరణలో, ఎర్రవల్లి శివాంజనేయ స్వామి ఆలయంలో మహా చండీదేవి అలంకరణలో దుర్గామాత భక్తులకు దర్శనమిచ్చారు.

■ రాజోళిలోని అంబాభవాని మాతకు మహిళలు ప్రత్యేక పూజలు చేస్తున్నారు. ఈ సందర్భంగా అమ్మవారు గౌరీదేవిగా దర్శనమిచ్చారు.

■ మల్దకల్ మండల కేంద్రంలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో సోమవారం అమ్మవారు అన్నపూర్ణాదేవిగా అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు బాదం శ్రీనివాసులు, నాగరాజు, ప్రవీణ్‌కుమార్, చిన్న నర్సింహయ్య, వెంకటేష్ పాల్గొన్నారు.

■ ధరూరులోని కాళీకాదేవి ఆలయంలో అమ్మవారిని మహా చండీదేవీగా అలంకరించారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం చేశారు.

■ ఉండవెల్లి మండల కేంద్రంలోని మణికంఠ అయ్యప్ప స్వామి ఆలయంలోని సరస్వతి అమ్మవారిని చండికాదేవి అలంకరణలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గాంధీనగర్, అంబేడ్కర్, అనసూయమ్మ కాలనీలో చండికాదేవి అలంకరణలో అమ్మవారి దర్శనం అందిస్తున్నారు.

తాగునీటి సరఫరా సహాయకులకు శిక్షణ



వడ్డేపల్లిలో శిక్షణ ఇస్తున్న మిషన్‌భగీరథ ఏఈఈ

శాంతినగర్: మిషన్ భగీరథ శాఖ ఆధ్వర్యంలో తాగునీటిని విడుదల చేసే సహాయకులకు ఎంబీ గ్రిడ్ ఈఈ పరమేశ్వరి ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. వడ్డేపల్లి, రాజోళి మండలాల పరిధిలోని వాటర్‌మెన్ లకు నాలుగు రోజుల శిక్షణలో భాగంగా చేతిపంపులు, ఎలక్ట్రిక్ మోటార్ల మరమ్మతు, పైప్‌లైన్ లీకేజీల గుర్తించి, సరిచేయడం, నీటి నాణ్యత తెలుసుకోవడం వంటి వాటిపై ఏఈఈలు మల్లేష్, వంశీకృష్ణ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రామకృష్ణ, ఎంపీఓ ఖాజ, ఎంబి హెల్పర్స్ పాల్గొన్నారు.

మానవపాడు: తాగునీటి సరఫరా సహాయకులకు మండలవ్యాప్తంగా నాలుగు రోజుల పాటు శిక్షణ కార్యక్రమం ఏర్పాట్లు చేసినట్లు మిషన్‌భగీరథ పథకం డీఈఈ వెంకట్రామ్‌నాయక్ తెలిపారు. మండలంలోని 16 గ్రామాలకు చెందిన 19మందికి శిక్షణ ఇస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఏఈఈ రాఘవేంద్ర, ల్యాబ్ టెక్నీషియన్లు అన్వర్ తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు వైద్యపరీక్షలు నిర్వహించాలి



మాట్లాడుతున్న డాక్టర్ రిజ్వానా తాన్వీర్

మానవపాడు: ఆరోగ్యకేంద్రంలో ప్రతి గర్భిణికి అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహించాలని డీఐఓ జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ రిజ్వానాతాన్వీర్ తెలిపారు. సోమవారం మండలకేంద్రంలో ఆశా కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గర్భిణులను గుర్తించి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, ఆరోగ్యకేంద్రంలో సాధారణ కాన్పులు చేయాలని సూచించారు. రక్తహీనత గురయిన వారిని గుర్తించి ఐరన్ మాత్రలు పంపిణీ చేయాలన్నారు. అదేవిధంగా 3, 6, 9, 12, 15 నెలలు పిల్లలకు పెరుగుదల దశలను పర్యవేక్షించాలని ఆదేశించారు. 30 ఏళ్లు పైబడిన వారికి బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులు పంపిణీ చేయాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ సింధు, చంద్రన్న, హెలెన్, అక్కమ్మ, తిరుమల్‌రావు, సోని సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రసవాలు సురక్షితం

మల్దకల్: ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాల సంఖ్య మరింత పెంచాలని డాక్టర్ స్వరూపరాణి వైద్య సిబ్బందికి సూచించారు. సోమవారం మల్దకల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ గ్రామాల్లో సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. సీజనల్‌గా వచ్చే వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. గర్భిణులు, బాలింతలు ప్రతినెల వైద్య పరీక్షలు చేయించుకోవడంతో పాటు, అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పౌష్టికాహారం సద్వినియోగం చేసుకునేలా వారికి అవగాహన కల్పించాలని ఆదేశించారు. కార్యక్రమంలో డాక్టర్ జయమ్మ, హెల్త్ సూపర్‌వైజర్లు శ్రీధర్, వెంకటస్వామి, ఏఎన్ఎంలు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

క్రీడలపై మక్కువ ఉండాలి

● కమాండెంట్ సాంబయ్య

ఎర్రవల్లి: ఆరోగ్యంగా ఉండాలంటే ప్రతి వ్యక్తి క్రీడలపై మక్కువ ఉంచాలని పదో పటాలం కమాండెంట్ సాంబయ్య అన్నారు. సోమవారం ఎర్రవల్లి మండలంలోని బీచుపల్లి పదో పటాలంలో ఇంటర్ స్క్వాడ్ క్రీడాపోటీల వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కమాండెంట్ హాజరై శిక్షణ సిబ్బందికి వారం రోజులుగా నిర్వహిస్తున్న క్రీడలకు ముగింపు పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిక్షణ సమయంలో సిబ్బందికి క్రీడలు నిర్వహించడం వల్ల మానసికోల్లాసంతో పాటు శరీర దృఢత్వం, పిజికల్ ఫిట్నెస్ సాధించవచ్చన్నారు. అనంతరం వివిధ విభాగాల్లో నిర్వహించిన 13 క్రీడల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన సిబ్బందిని అభినందించి వారికి మెడల్స్ అందజేశారు. కార్యక్రమంలో అదనపు కమాండెంట్ సుబ్రమణ్యం, అసిస్టెంట్ కమాండెంట్ శ్రీనివాస్, ఆర్ఐలు రాజారావు, గోపాల్, వెంకటేశ్వర్లు, సిబ్బంది ఉన్నారు.



సిబ్బందికి మెడల్స్ పంపిణీ చేస్తున్న కమాండెంట్ సాంబయ్య

ఆలయ అభివృద్ధికి కృషి



అయిజ: ఇటీవల అలంపూర్ ఆలయ కమిటీ సభ్యుడిగా నియమితులైన సురేంద్రస్వామిని సింధనూరులోని ఆయన నివాసంలో ధూపదీప అర్చక సంఘం జిల్లా అధ్యక్షుడు చక్రవర్తి సోమవారం శాలువా, పూలమాలలతో సత్కరించారు. ఈసందర్భంగ సురేంద్ర స్వామి మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి నిరంతరం కృషిచేస్తానన్నారు. కార్యక్రమంలో నాగరాజు, వెంకట్రామయ్య శెట్టి, శేఖరయ్య పాల్గొన్నారు.

శివాలయంలో పూజలు



ఎర్రవల్లి: బీచుపల్లి పుణ్యక్షేత్రంలోని శివాలయంలో సోమవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు లింగానికి అభిషేకం చేశారు.

అమ్మవారికి కుంకుమార్చన



గట్టు: స్థానిక భవానీమాత ఆలయ ఆవరణలో సోమవారం రాత్రి మహిళలు అమ్మవారికి కుంకుమార్చన చేశారు. పూజలో గద్వాల ఎమ్మెల్యే సతిమణి బండ్ల జ్యోతి పాల్గొన్నారు.

ఇద్దరిపై కేసు నమోదు

గద్వాల క్రైం: అతి వేగంగా డ్రైవింగ్ చేస్తూ.. అకారణంగా ఒకరిపై దాడి చేసిన ఘటనలో ఇద్దరు యువకులపై కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్ఐ కళ్యాణ్‌కుమార్ తెలిపారు. ఆదివారం రాత్రి 9 గంటల సమయంలో పట్టణానికి చెందిన గౌతమ్ అనే యువకుడు నదిగ్రహారం నుంచి గద్వాలకు బైక్‌పై వస్తున్నాడు. ఈ క్రమంలో చింతల్‌పేట్ కాలనీకి చెందిన నవీన్, భాస్కర్ ఆగ్రహారం రోడ్డు వైపుకు రాంగ్ రూట్, ర్యాష్ డ్రైవింగ్ చేస్తూ గౌతమ్ బైక్ పైకి దూసుకెళ్లారు. దీంతో భయాందోళన చెందిన సదరు యువకుడు బైక్‌ను ర్యాష్‌గా నడుపుతున్న యువకులను మందలించాడు. దీంతో ముగ్గురు యువకుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఈ క్రమంలో నవీన్, భాస్కర్ వారి స్నేహితులకు గొడవ జరుగుతున్నట్లు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. క్షణాల్లో అక్కడికి వచ్చిన 20 మంది స్నేహితులు గౌతమ్‌ను తీవ్రంగా చితకబాదారు. ఘటనపై బాధితుడు సోమవారం ఉదయం పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. ఇద్దరు యువకులను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశామన్నారు. దాడి చేసిన మరి కొంత మంది యువకుల కోసం విచారణ చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

చట్టాలపై అవగాహన ఉండాలి

ఖిల్లాఘనపురం: చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని లీగల్ డిఫెన్స్ కౌన్సిల్ ఉత్తరయ్య అన్నారు. సోమవారం రాత్రి మండల పరిధిలోని ఉప్పరిపల్లిలో జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వయో వృద్ధులు, మోటారు వాహనాల చట్టాల గురించి పూర్తిగా తెలుసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ తమ పిల్లలకు వాహనాలు ఇచ్చే ముందు తప్పనిసరిగా జాగ్రత్తలు చెప్పాలన్నారు. డిఫెన్స్ కౌన్సిల్ శ్రీదేవి మాట్లాడుతు సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఐ నాగరాజు, గండం యాదగిరి, అంజనేయులు, విష్ణు, శ్రీనువాస్‌రెడ్డి, చక్రవర్ధన్ రెడ్డి పాల్గొన్నారు.

రేపు బీచుపల్లిలో సామూహిక అక్షరాభ్యాసం

ఎర్రవల్లి: బీచుపల్లి పుణ్యక్షేత్రంలోని జ్ఞానసరస్వతి ఆలయంలో మూల నక్షత్రాన్ని పురస్కరించుకొని బుధవారం ఉదయం 8 గంటల నుంచి సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ మేనేజర్ సురేందర్ రాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయ చుట్టు ప్రక్కల ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరై తమ చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించి, అమ్మవారి కటాక్షం పొందాలని కోరారు.

'ఐటీ మంత్రి క్షమాపణ చెప్పాలి'



మాట్లాడుతున్న పల్లయ్య

అయిజ: ఐటీ మంత్రి శ్రీధర్‌బాబు నిరుద్యోగులకు క్షమాపణ చెప్పాలని బీఆర్ఎస్వీ జిల్లా కోఆర్డినేటర్ పల్లయ్య డిమాండ్ చేశారు. సోమవారం బీఆర్ఎస్వీ జిల్లా కోఆర్డినేటర్ కార్యర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిరుద్యోగుల పేరు చెప్పుకొని గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం వారిని మోసం చేసిందని దుయ్యబట్టారు. ఇటీవల అలంపూర్ నియోజకవర్గం పర్యటనకు వచ్చిన ఐటీ మంత్రి శ్రీధర్‌బాబు కాంగ్రెస్ ప్రభుత్వం 60 వేల ఉద్యోగాలను భర్తీ చేసిందని చెప్పడం హాస్యాస్పదం అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇంతవరకు విద్యా శాఖ మంత్రిని నియమించలేదని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే రాష్ట్రానికి ఐఐఎం, ఐఐటీ, ఐఐఎస్ఈఆర్, ఐఐఐటీ, ఎన్ఐడీ మెడికల్ కాలేజీలతో పాటు నవోదయ కాలేజీలను తీసుకురావాలని సవాల్ విసిరారు. కార్యక్రమంలో రమేష్ బాబు, కేశన్న, రాజు, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

స్థల వివాదం: కేసు నమోదు

ఉండవెల్లి: మండలంలోని అలంపూర్ చౌరస్తాలో పండ్లు అమ్ముకోవడానికి వచ్చిన ఇద్దరి మధ్య స్థలం చోటు చేసుకోవడంతో.. సుహాసిని అనే మహిళ మహేశ్వరిని గోళ్లతో రక్కడంతో.. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఎస్ఐ మహేష్ కేసు నమోదు చేశారు. ఈ నెల 3వ తేదీన ఉండవెల్లికి చెందిన సుహాసిని, చిన్న పోతులపాడు గ్రామానికి చెందిన మహేశ్వరి ఇద్దరు మహిళలు పండ్లు అమ్మకాలు నిర్వహిస్తున్నారు. సుహాసిని 20 ఏళ్లుగా.. మహేశ్వరి రెండేళ్లుగా పండ్లు అమ్ముతున్నారు. ఇద్దరు పక్కపక్కనే అమ్ముకుంటుండడంతో స్థలం నాది అంటే.. నాది అంటూ గొడవకు దిగారు. ఈ క్రమంలో సుహాసినిపై మహేశ్వరి దాడి చేసిందని, బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఎంబీబీఎస్ విద్యార్థికి ప్రశంసలు



అయిజ: మండలంలోని మేడికొండ గ్రామానికి చెందిన మైబు, షేకున్‌బీ దంపతుల కూతురు ఎండీ సమీనా జీజీహెచ్ అదిలాబాద్‌లో ఎంబీబీఎస్ సీటు సాధించింది. దీంతో సోమవారం పలువురు ప్రముఖులు సమీనాను అభినందించారు. ఈ సందర్భంగా సమీనా మాట్లాడుతూ తల్లిదండ్రులు చిన్న హోటల్ నడుపుతూ కష్టపడి చదివించారని, వారి కష్టానికి ఫలితం దక్కిందన్నారు. వైద్యురాలిగా ప్రజలకు మెరుగైన వైద్యం అందిస్తానని, తల్లిదండ్రులకు, గురువులకు మంచిపేరు తెస్తానన్నారు.

నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తాం

అయిజ: పవర్ ట్రాన్స్‌ఫార్మర్ సామర్థ్యాన్ని పెంచే పనులు పూర్తై మంగళవారం నుంచి సబ్ డివిజన్ పరిధిలో నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేస్తామని ఏడీఈ నీలి గోవిందు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రంలోని 132/33 కేవీ సబ్ స్టేషన్‌లో 31.5 ఎంవీఏ సామర్థ్యం గల పవర్ ట్రాన్స్‌ఫార్మర్ స్థానంలో 50 ఎంవీఏ సామర్థ్యం గల పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను అమర్చినట్లు తెలిపారు. మరమ్మతుల సమయంలో అయిజ, గట్టు, మల్దకల్ మండలాల్లోని అన్ని గ్రామాలకు, రాజోళి మండలంలోని మాన్‌దొడ్డిలో, కేటీదొడ్డి మండలంలోని చింతలకుంట సబ్‌స్టేషన్‌లో 5 రోజుల పాటు ప్రతిరోజు 2 గంటల నుంచి 3 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగిందని తెలిపారు. ఇకపై నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయనున్నట్లు పేర్కొన్నారు.

ఒక్కేసి.. పువ్వేసి చందమామ..



బతుకమ్మలతో మహిళలు

గద్వాలటౌన్: తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబిస్తూ బతుకమ్మను మహిళలు కీర్తించారు. సోమవారం స్థానిక స్మృతివనం ఆవరణలో మహిళా వాకర్స్ గ్రూప్ ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. మహిళలు పార్కు ఆవరణలో బతుకమ్మలను ఒకచోట చేర్చి పాటలకు అనుగుణంగా ఆడారు. ఎమ్మెల్యే సతీమణి బండ్లజ్యోతి బతుకమ్మ వేడుకలకు హాజరయ్యారు. కార్యక్రమంలో కౌన్సిలర్ మహేశ్వరి, మాజీ జెడ్పీటీసీ సభ్యురాలు పద్మ పాల్గొన్నారు.